

8వ పేజీలో

అర్ధ శతాబ్దపు అజ్ఞానాన్ని స్వతంత్రమందామా..
స్వర్ణోత్సవాలు చేద్దామా?

ఆత్మ వినాశపు అరాచకత్వాన్ని స్వరాజ్యమందామా..
సలాము చేద్దామా?

... స్వాతంత్ర్యం లభించి 50 ఏళ్లు అయిన సందర్భంగా దేశం సంబరాలు జరుపుకుంటున్న వేళ.. 1997లో సినీ కవి సిరివెన్నెల సీతారామశాస్త్రి దుఃఖ ధిక్కారపు స్వరంతో సమాజానికి పాట రూపంలో సంధించిన ప్రశ్నలు ఇవి.

... మరో 28 ఏళ్లు గడిచిపోయాయి. దేశంలో, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతూనే ఉన్నాయి. మరి... పరిస్థితులు మారుతున్నాయా? పేదల బతుకులు మెరుగవుతున్నాయా? పల్లెలు బాగుపడుతున్నాయా? ప్రశ్నలు మళ్లీ మళ్లీ సంధించుకోవాల్సిన సందర్భం ఇది. సంబరాలు జరుపుకుంటూనే సమస్యల్ని గుర్తు చేసుకుని పరిష్కారానికి సంకల్పం చెప్పుకోవాల్సిన సమయం ఇది.

చెక్కు చెదరని స్వాతంత్ర్య సిద్ధతా స్తూపం

రామకుప్పం మండలం బందార్లపల్లెలో 78సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సిద్ధతా స్తూపం ఇప్పటికీ చెక్కుచెదరకుండా దేశ సార్వభౌమత్వానికి నిదర్శనంగా నిలుస్తోంది. 1947 ఆగస్టు 14న అర్ధరాత్రి బ్రిటీష్ పాలకులు భారతదేశానికి స్వాతంత్ర్యం ఇస్తున్నట్లు ప్రకటించారు. బందార్లపల్లెకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచు దొడ్డేగౌడు ఆధ్వర్యంలో అప్పట్లో స్థానికులు స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దొడ్డేగౌడు సొంత ఖర్చులతో గ్రామ ముఖద్వారంలో ఓ స్తూపాన్ని నిర్మించి దానిపై జాతీయ జెండాను ఎగురవేశారు. స్తూపం కింద నల్లరాతిపై జైహింద్, స్వాతంత్ర్య సిద్ధతా భారత మహాదేశము అని, 1947 ఆగస్టు 14వ తేదీ అర్ధరాత్రి భారతీయులకు స్వాతంత్ర్యం అప్పగించి బ్రిటీష్ వారు దేశం వదిలి వెళ్ళిపోయారని చెక్కబడి ఉంది. 78ఏళ్ళుగా ఈ స్తూపం చెక్కు చెదరకుండా స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాన్ని గుర్తుకు తెస్తోంది.





స్తూపం కింద నల్లరాతిపై స్వాతంత్ర్యం వచ్చిన విషయాన్ని చెక్కిన దృశ్యం - స్వాతంత్ర్య సిద్ధతా స్తూపం

- రామకుప్పం, ఆంధ్రజ్యోతి



త్రివర్ణధారులు

స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ముగ్గురు విద్యార్థుల వేషధారణ ఆకట్టుకుంది.

- వెదురుకుప్పం, ఆంధ్రజ్యోతి

పంద్రాగస్టు వేడుకలకు పరేడ్ మైదానం ముస్తాబు

- మంత్రి సత్యకుమార్‌చే పతాకావిష్కరణ
- 343 మందికి ప్రశంసాపత్రాల ప్రదానం



పతాకావిష్కరణకు సిద్ధం చేసిన స్టేజ్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దిన వేడుకలకు చిత్తూరులోని ప్రశాంత్‌నగర్ వద్ద వున్న పోలీసు పరేడ్ మైదానం సిద్ధమైంది.ఆహ్వానం పలుకుతూ మహిళా పోలీసులు పలువర్ణాల రంగవల్లులతో గ్రౌండును తీర్చిదిద్దారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రత్యేక అతిథులు, అవార్డుగ్రహీతలు, మహిళలు, ప్రజల కోసం వేర్వేరుగా సీటింగ్ అరేంజ్‌మెంట్స్ చేశారు.ఏటా ఉదయం 9.05 గంటలకు ప్రారంభమయ్యే పతాకావిష్కరణ కార్యక్రమం ఈసారి అరగంట ముందుగానే ప్రారంభమౌతుంది. శుక్రవారం ఉదయం 8.35 గంటలకు పోలీసు పరేడ్ మైదానంలో రాష్ట్ర ఆరోగ్య శాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. పోలీసుల గౌరవవందనాన్ని స్వీకరించాక జిల్లా ప్రగతిని ప్రజలకు వివరిస్తారు. ఎంపిక చేసిన ఎనిమిది ప్రభుత్వ శాఖలచే అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ శకటాల ప్రదర్శన కొనసాగుతుంది.విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలుంటాయి. విధినిర్వహణలో ప్రతిభ కనబరచిన 343మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి మంత్రి మెమెంటోలు, ప్రశంసాపత్రాలు బహూకరిస్తారు.వీరిలో పోలీసు శాఖకు చెందిన వారు 95మంది కాగా మిగిలిన శాఖల అధికారులు 248మంది వున్నారు. డీఆర్డీఏ, డ్వామా, వయోజన, గిరిజన సంక్షేమ శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించిన అనంతరం లబ్ధిదారులకు మంత్రి ఆస్తులు పంపిణీ చేస్తారు.

నేడు పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఉన్న 697 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించాలని డీపీవో సుధాకరరావు గురువారం ఆదేశాలు జారీచేశారు. పీఎం - సూర్యఘర్, పీఎం-కుసుమ వంటి పథకాలతో సంప్రదాయేతర ఇంధన వనరులను సద్వినియోగం చేసుకునేలా గ్రామపంచాయతీల ప్రజలను ప్రోత్సహించాలని అన్ని పంచాయతీల కార్యదర్శులకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ మేరకు కేంద్ర పంచాయతీరాజ్ శాఖ లేఖలు రాసిందని పేర్కొన్నారు. అలాగే గ్రామ పంచాయతీల అభివృద్ధికి సంబంధించి తొమ్మిది అంశాలపై 'పంచాయత్ నిర్ణయ్' యాప్ ద్వారా డేటా సేకరించాలని సూచించారు.

జీపీ రామనారాయణరెడ్డి తొలగింపు

చిత్తూరు లీగల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని జిల్లా కోర్టు సముదాయంలోని పలు కోర్టులకు గౌవర్నమెంట్ ప్లీడర్ (జీపీ)గా ఉన్న రామనారాయణరెడ్డిని తొలగిస్తూ రాష్ట్రప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన స్థానంలో త్వరలో మరొకరిని జీపీగా ప్రభుత్వం నియమించనుంది.

ఫ్రీ బస్సు రెడీ

- నేటి సాయంత్రం నుంచి స్త్రీశక్తి పథకం అమల్లోకి



చిత్తూరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం పేరిట మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం శుక్రవారం సాయంత్రం నుంచి అమలు కానుంది.జిల్లావ్యాప్తంగా ఉన్న 5 ఆర్టీసీ డిపోలతో పాటు నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఈ పథకం ప్రారంభం కానుంది. చిత్తూరు ఆర్టీసీ బస్టాండ్‌లో సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ పాల్గొంటారు. పథకం అమలులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే ఏయే మార్గాల్లో రద్దీ నెలకొంటుందో ఆర్టీసీ అధికారులు అధ్యయనం చేశారు. అందుకు అనుగుణంగా ఆర్టీసీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. జిల్లాలోని చిత్తూరు-1, చిత్తూరు-2 ,పలమనేరు, పుంగనూరు, కుప్పం డిపోలనుంచి మొత్తం 461 బస్సులు నడుస్తున్నాయి. వీటిలో పల్లెవెలుగు 281, ఎక్స్‌ప్రెస్ 107 బస్సులతో కలిపి మొత్తం 388 బస్సులున్నాయి.అంతరాష్ట్ర సర్వీసులు 72 మినహాయిస్తే 316 బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నట్లు డీపీటీవో రాము వెల్లడించారు.

బస్టాండ్లలో పెరిగిన వసతులు

స్త్రీశక్తి పథకం అమలుతో పెరగనున్న రద్దీకి అనుగుణంగా బస్టాండ్లలో తాగునీరు, మరుగుదొడ్లు, లైట్లు వంటి సౌకర్యాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చారు.ట్యాంకులకు, కొళాయిలకు అవసరమైన చోట రిపేర్లు పూర్తి చేశారు. ప్రయాణికులు వేచి ఉండేందుకు అదనంగా కుర్చీలు, ఉక్కపోత లేకుండా ఫ్యాన్లు అమర్చారు.చిత్తూరు బస్టాండులో తాగునీటికి ఇబ్బంది లేకుండా రెండు ఆర్వో మిషన్లు అమర్చనున్నారు. అలాగే బస్టాండ్ ఆవరణలో ఉచితంగా రెండు నూతన టాయిలెట్లు ఏర్పాటు చేశారు.

4966 బోగస్ పెన్షన్ల ఏరివేత

- వైసీపీ పాలనలో ఇష్టారాజ్యంగా ఇచ్చిన పింఛన్ల సవరణ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి) : మంచం పట్టామంటూ.....దివ్యాంగులమంటూ ప్రతి నెలా వేలాది రూపాయలు పింఛన్ రూపంలో అనుచిత లబ్ధి పొందుతున్న అనర్హులకు చెక్ పడింది.ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకులు తమ అనుయాయులకు అర్హత లేకున్నా పింఛన్ పేరిట లబ్ధి చేకూర్చారని విమర్శలు వచ్చిన విషయం తెలిసిందే.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇలాంటి పింఛన్లపై దృష్టి సారించి సర్వే చేయించింది.ఈ సర్వేలో వేలాదిమంది పింఛన్లకు అనర్హులని తేలింది.అత్యధికంగా దివ్యాంగుల కోటాలో పింఛన్ పొందుతున్నవారున్నారు.జిల్లావ్యాప్తంగా 22,338 పింఛన్లు పునఃపరిశీలించగా, మరో 12,939 పింఛన్లు పునఃపరిశీలన చేయాల్సి ఉంది.పరిశీలించిన వాటిలో 17,064 పింఛన్లు సరైనవేనని తేలింది.545 పింఛన్లను వృద్ధాప్య పింఛన్లుగా మార్చారు.4,732 పింఛన్లు బోగస్‌గా తేల్చి రద్దు చేశారు. అలాగే జిల్లాలో నెలనెలా రూ.15 వేలు అందుకుంటున్న 1936మంది మంచాన పడిన(బెడ్ రిడన్) రోగుల పింఛన్లను పరిశీలించారు.వీరిలో 11 మంది చనిపోయారని, మరో 14 మంది స్థానికంగా లేనట్లు గుర్తించారు. మిగిలిన వారిలో 783మందిని దివ్యాంగుల కేటరిగిలో రూ.6 వేల పింఛన్‌కు మార్చారు.మరో 70మందిని వృద్ధాప్య పింఛన్లకు మార్చారు. 824మంది మాత్రమే మంచాన పడిన రోగుల జాబితాలో అర్హత సాధించగా, 234 మంది బోగస్ పింఛన్ దారులుగా తేల్చి జాబితా నుంచి తొలగించారు.

సవరించిన టెట్ మార్కులతో డీఎస్సీ స్కోర్ కార్డులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సవరించిన టెట్ మార్కులతో డీఎస్సీ స్కోర్ కార్డులను బుధవారం రాత్రి నుంచి అభ్యర్థులకు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఏపీ మెగా డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఏవైనా అభ్యంతరాలుంటే, అభ్యర్థి ఐడీనెంబరు ద్వారా వెబ్‌సైట్‌లో వివరాలను పొందుపర్చాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక తుది స్కోర్ కార్డులు విడుదల కానున్నాయి.

62 పాఠశాలల ఉన్నతీకరణ

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 62 పాఠశాలలను ఉన్నతీకరిస్తూ డీఈవో వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. 62 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించారు. ఖాళీలుగా ఉన్న మిగులు పోస్టుల మార్పిడి, అప్‌గ్రేడ్ వాటికి కొత్త పోస్టులు ఏర్పాటు చేయడం ద్వారా పోస్టుల లోటు తీర్చారు. జిల్లాలోని 618 వర్కింగ్ సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం/హెచ్‌ఎంగా మార్చారు. మరో 490 పోస్టులు అప్‌గ్రేడ్ చేశారు.

27నుంచి కాణిపాక బ్రహ్మోత్సవాలు



బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మంత్రి రామనారాయణరెడ్డి, ఎమ్మెల్యే మురళీమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఈవో కిషోర్

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాక వరసిద్ధుని వార్షిక బ్రహ్మోత్సవాల గోడపత్రికను దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి గురువారం రాత్రి తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన్ను ఆలయ వేదపండితులు ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు.తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్లు, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఈవో పెంచలకిషోర్ పాల్గొన్నారు.

అన్నదాతల సంతోషమే లక్ష్యం

చిత్తూరులో ట్రాక్టర్లతో రైతుల భారీ ర్యాలీ





ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే జగన్మోహన్, ఎన్టీఆర్ విగ్రహానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే, నేతలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాతల సంతోషమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమైనందుకు కృతజ్ఞతగా గురువారం స్థానిక పీవీకేఎన్ డిగ్రీ కళాశాల నుంచి గాంధీ విగ్రహ కూడలి వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఓ ట్రాక్టర్ నడిపారు. ఆయన మాట్లాడుతూ.. మామిడి రైతులను ఆదుకోవడంతో పాటు ఏ ప్రభుత్వాలు చేయని విధంగా రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నామని చెప్పారు. రాష్ట్ర పరిస్థితి ఇబ్బందికరంగా ఉన్నప్పటికీ రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని ప్రశంసించారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు వెంకటేశ్ యాదవ్, సుబ్బానాయుడు, జయచంద్రనాయుడు, అట్లూరి శ్రీనివాసులు, భారీ సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పవన్‌పై దాడి కేసులో 8 మంది అరెస్టు

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో పవన్‌కుమార్‌పై దాడి చేసిన కేసులో ఎనిమిది మంది నిందితులను గురువారం అరెస్టు చేసి రిమాండుకు పంపారు. దీంతో మొత్తం అరెస్టయిన వారి సంఖ్య పదికి చేరింది. తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం తెలిపిన ప్రకారం.. పవన్‌ను విచక్షణారహితంగా కొడుతున్న దినేష్ వీడియో వైరల్ అయిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఇతడే ఏ1. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం అట్లవారిపల్లెకు చెందిన దినేష్ తిరుపతిలోనే ఉంటున్నాడు. అరెస్టయిన వారిలో ఇంకా గంగాధరనెల్లూరు మండలం వేల్కూరుకు చెందిన రేవంత్‌రాజు, ఓజిలికి చెందిన అజయ్‌కుమార్, తిరుపతిలోని మంచినీళ్లగుంటకు చెందిన మలిశెట్టి హరికృష్ణ, పులిచెర్ల మండలం బండారువారిపల్లెకు చెందిన ప్రవీణ్‌కుమార్, చౌడేపల్లె మండలం పరికిదొనకు చెందిన కిశోర్‌బాబు, సదుం మండలం పాలమందకు చెందిన మధు, సత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం కడపలవారిపల్లెకు చెందిన సాయికిరణ్ ఉన్నారు. ప్రస్తుతం వీరిలో సాయికిరణ్ బెంగళూరులో ఉండగా, మిగిలిన వారంతా తిరుపతిలో నివాసం ఉంటున్నారు. ఈ ఎనిమిది మంది తిరుపతి రూరల్ మండలం రామచంద్రాపురం జంక్షన్ సమీపాన అవిలాల మైదానం దక్షిణ గేటు వద్ద ఉండగా అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. మిగిలిన నిందితులనూ త్వరలోనే పట్టుకుంటామని చెప్పారు. కాగా, ఈ కేసులో ఏ2, ఏ3 నిందితులైన అనిల్‌కుమార్‌రెడ్డి, జగదీశ్వర్‌రెడ్డిని ఇంతకుముందే అరెస్టు చేసిన విషయం తెలిసిందే.



శ్రీవారి సేవలో జాన్వీ కపూర్

బాలీవుడ్ నటీనటులు జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్ర గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. అలిపిరి కాలిబాటలో బుధవారం రాత్రి తిరుమల చేరుకున్న వీరు గురువారం ఉదయం వీఐపీ బ్రేక్‌లో మూలవిరాట్టును దర్శించుకున్నారు. ఆలయం వెలుపల జాన్వీ కపూర్, సిద్ధార్థ్ మల్హోత్రను చూసేందుకు అభిమానులు ఉత్సాహం చూపారు.



తల్లిదండ్రులతో చిన్నారి జాన్వీ కపూర్

హ్యాపీ బర్త్‌డే అమ్మ

'హ్యాపీ బర్త్‌డే అమ్మ.ప్రతి అడుగులో నీ పేరు నా గుండెల్లో ఉంటుంది' అంటూ జాన్వీ కపూర్ గురువారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. ఆగస్టు 13న శ్రీదేవి పుట్టిన రోజు. దీనిని పురస్కరించుకుని తన చిన్ననాట తిరుమలలో తలనీలాలు సమర్పించి తల్లిదండ్రులు శ్రీదేవి, బోనీ కపూర్‌తో కలిసి ఉన్న ఫొటోను పోస్ట్ చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

సోలార్ ఫెన్సింగ్‌పై పడి రైతు మృతి



షణ్ముగం (ఫైల్)

సత్యవేడు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు మండలం మదనంబేడులోని పొలాల వద్ద బుధవారం రాత్రి సోలార్ ఫెన్సింగ్‌పై పడి రైతు మృతిచెందారు. గ్రామస్తుల కథనం మేరకు.. పంటకు నీళ్లు పెట్టడానికని నాదముని కుమారుడు శ్రీరామ్‌షణ్ముగం పొలానికి వెళ్లారు. సోలార్ విద్యుత్ స్విచ్ ఆన్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అదుపుతప్పి పొలానికి ఏర్పాటు చేసిన సోలార్ కంచెపై పడ్డారు. ఆ సమయంలో అక్కడ ఎవరూలేక పోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఎంత సేపటికీ షణ్ముగం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వచ్చి చూడగా మృతి చెంది ఉన్నారు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. కాగా షణ్ముగంకు భార్య, కుమారుడు ఉన్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం గ్రామానికి చేరుకుని షణ్ముగం భౌతికకాయానికి నివాళులు అర్పించి, మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. షణ్ముగం కుటుంబ సభ్యులకు రూ.10వేలు ఆర్థిక సహాయం అందించారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.31 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,859

తలనీలాలు సమర్పించినవారు: 33,344





పల్లె కన్నీరు పెడుతూనే ఉంది

తెల్లదొరల చేతుల్లోంచి నల్లదొరల చేతుల్లోకి పాలన మారడాన్ని స్వతంత్రం అందామా..?

అయితే మనకు 78 ఏళ్ల కిందటే స్వతంత్రం వచ్చింది!

పరాయి సంకెళ్లను తెంచేందుకు పోరాడిన యోధులు ఆశించిన భారతం ఇదేనా?

కాదు..కాదు..ఎన్నటికీ కానేకాదు!

క్యాలెండర్‌లో కాయితాలు చిరిగిపోతున్నాయి తప్ప, ప్రజల కడగండ్లు తీరుతున్నాయా? అధికారం చేతులు మారింది తప్ప, జీవనప్రమాణాలు పెరిగాయా? సొంత పాలనలోకి మారి ఏడు దశాబ్దాలు దాటి ఎనిమిదో దశాబ్దంలోకి అడుగుపెడుతున్నా పల్లెలు ఈసురోమంటూనే ఉన్నాయి. సేద్యం ఒక జూదంగా మారిపోయింది. స్వేదజలాలతో పంటలు పండించినా ఫలితం వెక్కిరిస్తోంది. ఉరితాళ్లలో, ఎండ్రిన్ డబ్బాల్లో పరిష్కారాన్ని అన్నదాతలు వెతుక్కుంటూనే ఉన్నారు. గుంతలు, గతుకుల మయమైన రోడ్లు.. రోడ్లున్నా బస్సులు రాని ఊళ్లు.. మరణిస్తే జానెడు జాగా దొరకడం గగనంగా మారిన పల్లెలు.. స్వతంత్ర భారత వజ్రోత్సవాలకు దిష్టిచుక్కల సాక్ష్యంలా చిత్తూరు జిల్లాలో ఇలా మిగిలే ఉన్నాయి. సంబరాలు చేసుకునే వేళ అయినా.. సంకల్పం చెప్పుకోవాలనే ఆశతోనే ఈ కథనం...

ఆంధ్రజ్యోతి చిత్తూరు జిల్లా నెట్‌వర్క్

ఈ గాయం మానదా?

తెల్లదొరల పాలనలో పడ్డ అమానవీయ ముద్ర ఇప్పటికీ తొలగక అలమటిస్తున్న ప్రజలు జిల్లాలో అనేక పల్లెల్లో ఉన్నారు. దొంగలనీ, వేశ్యలనీ వేసిన ముద్రతోనే మానసికంగా చితికిపోతున్నారు.పోలీసులకు బంగారు గుడ్లు పెట్టే బాతుల్లా ఈ గ్రామాలు మారిపోయాయి.



- కుప్పం పట్టణంలోని లక్ష్మీపురం ప్రాంతంలోని ప్రజల్ని డబ్బావాళ్లు అంటారు. వీరు స్థానికంగా కాకుండా తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో దొంగతనాలు చేస్తుంటారని ప్రచారం.బయటి ప్రాంతాల నుంచి రికవరీల కోసం పోలీసులు తరచూ ఇక్కడికి వస్తుంటారు. దొంగతనాలు మానేసి తరాలు గడుస్తున్నా తమను అవమానకరంగా చూస్తున్నారని వీరు వాపోతుంటారు. ఒక వేళ కొందరు ఇప్పటికీ దొంగతనాలు చేస్తూనే ఉంటే వీరిని మార్చే ప్రయత్నం ఎందుకు చేయడం లేదన్న ప్రశ్నకు 78 ఏళ్ల స్వాతంత్ర్య భారతం సమాధానం చెప్పలేకపోతోంది.
- నగరి మండలంలోని ఓజీకుప్పాన్ని కూడా దొంగల ఊరుగానే ఇప్పటికీ పిలుస్తారు. కర్ణాటక, తమిళనాడు ప్రాంతాల పోలీసులు దొంగ సొమ్ము రికవరీ కోసం ఈ పల్లె మీద విరుచుకుపడుతుంటారు. పనులు చేసుకుని బతుకుదామన్నా ఇచ్చేవారు లేరు. ఓజీకుప్పం అని చెప్పగానే తరిమేస్తారని ఈ ఊరి ప్రజలు బాధపడుతుంటారు.
- పెద్దపంజాణి మండలంలోని పెద్ద ముద్దేపల్లె, చిన్న ముద్దేపల్లె, కొత్త ముద్దేపల్లె, ముద్దేపల్లె గ్రామస్తులు ఒకప్పుడు దొంగతనాల మీద ఆధారపడ్డారని చెబుతారు. ప్రస్తుతం వీరంతా వ్యవసాయం, వ్యాపారం వంటివాటిని జీవనోపాధిగా ఎంచుకున్నారు. చదువుకుని జీవితాల్లో మార్పు తెచ్చుకున్నారు. అయినా ఆ ముద్ర మాత్రం మాయలేదని వీరు కుమిలిపోతుంటారు.
- పెద్దపంజాణి మండలంలోని ఓ గ్రామంలో ఒకప్పుడు వేశ్య వృత్తిని ఎంచుకుని జీవించేవారు ఉండేవారంటారు. వారు కూడా మారిపోయి వ్యవసాయం, పనులు చేసుకుంటున్నారు. అయినా ఆ ఊరి పేరెత్తగానే ఎదురయ్యే వెకిలి మాటలూ, వెకిలి నవ్వులూ అక్కడి ప్రజల గుండెల్లో గునపాలుగా మారుతుంటాయి.
- గుడిపాల మండలం రాసానపల్లె సారా తయారీకి రాష్ట్రంలోనే పేరు మోసింది. చట్టాలు కఠినంగా ఉండడం, పీడీ యాక్టులు పెట్టడం తదితరాల కారణంగా ప్రస్తుతం ఇక్కడ తయారీ లేదు. అయినా బయటి ప్రజలకు ఈ గ్రామస్తులంటే చిన్నచూపే ఉంది. ఈ ఊరికి పిల్లనివ్వడానికి కూడా భయపడుతుంటారు.

చావుకు పుట్టని జాగా..!



గుడిపాల మండలం ముత్తుకూరుపల్లెలోని చెరువులో ఉన్న శ్మశానం

ఆఖరి ప్రయాణంలో ఆరడుగుల నేల కోసం జిల్లాలో అనేక పల్లెలు తల్లడిల్లుతూనే ఉన్నాయి. శ్మశానాలు లేక, ఉన్న శ్మశానాలకు దారిలేక పడుతున్న అవస్థలకు దశాబ్దాలు గడుస్తున్నా మార్పులేదు.

- పెనుమూరు మండలం చార్వాగానిపల్లె దళితవాడకు శ్మశానం లేక రోడ్డు పక్కన కర్మక్రియలు చేసుకుంటున్నారు. ఆ స్థలాన్ని వైసీపీ ప్రభుత్వం పాలిటెక్నిక్ కోసం కేటాయించింది.
- యాదమరి మండలం వరదరాజులపల్లె దళితవాడ శ్మశానానికి దారి సౌకర్యం లేదు. వ్యవసాయ పొలాలపైనే పాడె మోసుకుంటూ వెళ్తారు.
- గుడిపాల మండలంలోని ముత్తుకూరుపల్లెకు శ్మశానం లేక చెరువులోనే అంతిమ సంస్కారం చేసుకుంటున్నారు.
- విజయపురం మండలంలోని కేశవపురం, మల్లారెడ్డి కండ్రిగ ఆదిఆంధ్రవాడ శ్మశానాలకు దారి సమస్య ఉంది. ఇక్కడ చనిపోయిన ప్రతిసారీ గొడవలు జరుగుతున్నాయి.
- ఎస్‌ఆర్‌పురం మండలంలోని చొక్కామడుగు, మత్రిపల్లె, చిన్నతయ్యూరు, నెలవాయి, ఎన్టీఆర్ కాలనీ గ్రామాల శ్మశానాలకు దారి లేదు.
- పుంగనూరు మండలంలోని తోపుమఠం, ఏటిగడ్డపాళ్యానికి శ్మశానాలు ఉన్నప్పటికీ దారి లేదు.



మా ఊళ్లో ఎవరైనా చస్తే మా చావు మేం చావాల్సిందే. ఎక్కడ పూడ్చాలో తెలియదు. పొలాలున్నవాళ్లు వాళ్ల పొలాల్లోనే పూడ్చుకుంటారు. జానెడు నేల లేని మా గతేమి? అధికారులకు అర్జీలు ఇచ్చీ ఇచ్చీ విసిగిపోయాం.

- గంగయ్య, జగన్నాథయ్య, బూసిపల్లె దళితవాడ, పూతలపట్టు మండలం

పల్లె మాయమవుతోంది

యాదమరి మండలం సిద్ధారెడ్డిపల్లె పంచాయతీ రాచూరు ఏఎడబ్ల్యూ గ్రామంలో 50 ఏళ్ల కిందట 35 కుటుంబాలు నివసిస్తూ ఉండేవి. దారిలేని ఈ ఊరిలో వసతులు కూడా ఏమీ లేవు. ఇక్కడ బతకలేక ఒక్కో కుటుంబం ఊరొదిలి వెళ్లిపోతోంది. ఇప్పుడు పది కుటుంబాలవారు మాత్రమే ఇదిగో ఇలాంటి ఇళ్లలో జీవిస్తున్నారు.



మా ఊళ్లోకి ఆటో వచ్చే తోవ కూడా లేదు. అనారోగ్యం వస్తే మోసుకుంటూ కిలోమీటరు నడవాల్సిందే.

- ఆనందన్, రాచూరు ఏఏడబ్ల్యూ గ్రామస్తుడు



బస్సు రాని పల్లెలు

జిల్లాలో తారురోడ్డు సౌకర్యం ఉండి కూడా ఆర్టీసీ బస్సులు నడవని గ్రామాలు 45 అని ఆర్టీసీ అధికారులే చెప్తున్నారు. ఈ గ్రామాల విద్యార్థులు, ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఆటోల వంటి ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. గుడిపాల మండలంలోని దాయంవారిపల్లె, బొజ్జవారిపల్లె, చీలాపల్లె, చెరుకూరుకండిగ, కట్టకిందపల్లె, గొల్లమడుగు, బొమ్మసముద్రం- తవణంపల్లెలోని అరగొండ మత్యం, కామాలూరు- విజయపురం మండలంలోని కాళికాపురం, జీఎంపురం, బూచివానత్తం, ఎం.అగరం, పోతురాజులు కండిగ్ర, ముత్యాలరెడ్డి కండిగ్ర- ఎస్‌ఆర్‌పురం మండలంలోని ముద్దికుప్పం, ఉడమలకుడితి - పెనుమూరు మండలంలోని సీఆర్‌కండ్రిగ, చింతపేట పంచాయతీలకు- పుంగనూరు మండలం వనమలదిన్నె, పెద్దఅలసాపురం, పాలెంపల్లె, ఎల్లారుబైలు, ఎంసీపల్లె- సోమల మండలం అన్నమ్మగారిపల్లె, తమ్మినాయనపల్లె, పేగలవారిపల్లెకు- ఐరాల మండలంలోని వేదగిరివారిపల్లె, దివిటివారిపల్లెలకు బస్సు సౌకర్యం లేదు.





విజయపురం మండలంలోని జీఎంపురం- కాళికాపురం రోడ్డు ఇది. ఈ మాత్రం తారు రోడ్డున్నా బస్సుమాత్రం రాదు.

పచ్చదనం పరిమళిస్తున్న ఈ ఊరిపేరు చుక్కావారిపల్లె. చౌడేపల్లె మండలంలో ఉంది. తారురోడ్డున్నా, ఆర్టీసీ బస్సు రాదు. చౌడేపల్లె నుంచి చుక్కావారిపల్లె మార్గంలో కొత్తపల్లె, పందిళ్లపల్లె, నడింపల్లె, బాలసముద్రం గ్రామాలున్నాయి. కాలేజీకి వెళ్లే విద్యార్థులు 50 మంది ఆటోలు, స్కూటర్లలో వెళ్తున్నారు. 1.5 కి.మీ దూరంలోని హైస్కూల్‌కు పిల్లలు నడుచుకుంటూ, సైకిళ్లపై వెళ్తుంటారు. పలమనేరు, చౌడేపల్లె ప్రాంతాల్లో పని ఉన్న ప్రజలకు కూడా ఆటోలే దిక్కు. గతంలో రెండు ట్రిప్పులు బస్సు తిరిగేది. రెండేళ్లుగా దాన్నీ రద్దు చేశారు.

ఈ దారుల్లో ప్రయాణం ఎట్లా?

మండల కేంద్రాల నుంచి సరైన రోడ్లు లేని గ్రామాలు జిల్లాలో లెక్కకుమిక్కిలి మిగిలే ఉన్నాయి. గుడిపాల మండలంలోని సింగారపేట, వెప్పాలమానుచేను, నక్కలపాలెం- తవణంపల్లె మండలంలోని రామకృష్ణాపురం, కొండకింద కనకాపురం- విజయపురం మండలంలోని లక్ష్మీవిలాసపురం, కోసలనగరం పంచాయతీ మిట్టూరు- ఎస్‌ఆర్‌పురం మండలంలోని పిల్లిగుండ్లపల్లె, ఎస్టీ కాలనీ, ఎస్‌ఆర్‌పురం ఎస్టీ కాలనీ, కొండపాళ్యం ఎస్టీకాలనీ, రాఘవరాజపురం గ్రామాలకు తారురోడ్డు లేక ప్రజలకు నిత్యం అవస్థలే!

బైరెడ్డిపల్లె మండలం కైగల్ నుంచి రామసముద్రం, శనిపల్లె, మునిపల్లె గ్రామాలకు తారురోడ్డు లేదు. 5 వేలమంది ఏళ్లుగా ఈ మట్టి రోడ్డులోనే ప్రయాణిస్తున్నారు. తారు రోడ్డు లేదని బస్సు వేయలేదు. వంద మంది విద్యార్థులు రోజూ వి.కోట, పలమనేరుకు వెళ్లేందుకు కైగల్ వరకు 5 కిలోమీటర్లు సైకిల్ మీద వచ్చి బస్సెక్కాలి. ఇక్కడ పండే టమోటా, వివిధ రకాల కూరగాయలు తరలించేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు.





ఎస్‌ఆర్‌పురం మండలం పిల్లిగుండ్లపల్లె ఎస్టీకాలనీకి వెళ్లే రోడ్డు ఇది

పెరగని టమోటా ధరలు



పలమనేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ యార్డులో గత వారం రోజులుగా టమోటాకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల నుంచే కాకుండా చౌడేపల్లి, సోమల మండలాల నుంచి టమోటా రైతులు టమోటాలను పలమనేరు మార్కెట్‌యార్డుకు తీసుకొస్తున్నారు. గత రెండు నెలలుగా పలమనేరు మార్కెట్ యార్డులో 15 కిలోల టమోటా బాక్సు ధర రూ. 450 నుంచి రూ.600 దాటడం లేదు. నెలరోజుల క్రితం టమోటాలకు ధరలు కొంతమేర పెరిగినప్పటికీ వరుస వర్షాల కారణంగా టమోటా ధరలు గణనీయంగా పడిపోయాయి. గురువారం పలమనేరు మార్కెట్ యార్డులో బాక్సు కేవలం రూ.400 నుంచి రూ.600 మాత్రమే ధర పలికిందని రైతులు తెలిపారు. వర్షాల కారణంగా టమోటా తోటల్లోనే మాగిపోవడంతో రైతులు గత్యంతరం లేక మార్కెట్‌కు తీసుకొచ్చి అయినకాడికి అమ్ముకోవాల్సి వస్తోంది.

నేడు సాంబయ్యకండ్రిగకు మంత్రి సత్యకుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శుక్రవారం మధ్యాహ్నం చిత్తూరు నగరం సాంబయ్యకండ్రిగలో బ్రహ్మకుమారీస్ ఆశ్రమం ఎదుట ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు.5.30 గంటలకు రోడ్డుమార్గాన హార్సిలీహిల్స్‌కు బయలుదేరి వెళ్తారు.

తార్కిక ఆలోచనలే విజయానికి సోపానాలు

- యండమూరి వీరేంద్రనాథ్

తిరుపతి రూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తార్కిక ఆలోచనల ద్వారా పోటీపరీక్షల్లో విజయాన్ని సాధించవచ్చని నవలారచయిత, వ్యక్తిత్వ వికాస నిపుణుడు యండమూరి వీరేంద్రనాథ్ పేర్కొన్నారు. ఎంఆర్‌పల్లెసర్కిల్‌లోని కౌటిల్య ఇన్‌స్టిట్యూట్‌లో స్టెప్ ఫర్ సక్సెస్ అనే అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. వివిధ పోటీల్లో విజయానికి వ్యూహాలు, నాయకత్వ లక్షణాలు, ఏకాగ్రత, జ్ఞాపకశక్తికి మెళకువలు, మొబైల్‌ఫోన్ నుంచి విముక్తి, ఒత్తిడి నిర్వహణ వంటి విషయాలపై పలు సూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ..ఆరోగ్యం, కీర్తి, సంపద, ప్రేమ, ఉత్సాహం విజయానికి నిర్వచమన్నారు. మానసిక ఆరోగ్యమున్న వ్యక్తి భయం, దుఃఖం, కోపం అనే మూడు రకాల వ్యాధుల నుంచి బయటపడతాడన్నారు. వైఫల్యాలని విజయాలకు దారితీసే మెట్లుగా మార్చుకోవడమన్నది పాత పంథాఅన్నారు. వైఫల్యమే లేనంతగా కృషి చేయడమనది నేటి పోటీ ప్రపంచంలో కొత్త ఒరవడి అన్నారు. స్మార్ట్ ఫోన్లతో విలువైన సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. అనవసర స్నేహాల వల్ల ఉన్నతికి అడ్డుకట్టపడుతుందన్నారు. లీడర్‌షిప్, కామన్‌సెన్స్, కమ్యూనికేషన్, తెలివి లక్షణాలను కలిగి ఉంటే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని విద్యార్థుల్లో చైతన్యం నింపారు. సంస్థ డైరెక్టర్ శ్రీధర్ తదితరులు మాట్లాడారు.



మాట్లాడుతున్న యండమూరి వీరేంద్రనాథ్

నీటి నిర్వహణకు పటిష్ఠమైన చర్యలు

● సీఎంకు వివరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నీటి నిర్వహణకు పటిష్ఠమైన చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. గురువారం సాయంత్రం అమరావతి నుంచి సీఎం చంద్రబాబు అన్ని జిల్లాల కలెక్టర్లు, అధికారులు, సాగునీటి సంఘ అధ్యక్షులతో నీటి నిర్వహణ, భూగర్భ జలాల పెంపు, నీటి సంరక్షణ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా చిత్తూరు కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూగర్భజలాల పెంచడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీటి సంరక్షణ చర్యల్లో భాగంగా ఫారమ్‌పాండ్స్ నిర్మిస్తామని, చెరువులు, రిజర్వాయర్లలో పూర్తిస్థాయిలో నీటి నిల్వకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని వివరించారు. సీఎం మాట్లాడుతూ.. కరువు సమస్యలు తలెత్తకుండా నీటి నిర్వహణ చేపట్టాల్సిన బాధ్యత సాగునీటి సంఘాల ప్రతినిధులు, జిల్లా యంత్రాంగాలదేనని స్పష్టం చేశారు.

14 మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో 14 మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాల వారీగా.. విజయపురంలో 10.4, సోమలలో 6.4, పుంగనూరులో 6.2, రొంపిచెర్లలో 5.8, నింద్ర, సదుంలో 5.2, కార్వేటినగరంలో 4.6, పులిచెర్లలో 4.2, చౌడేపల్లెలో 4, వెదురుకుప్పంలో 3.2, ఐరాలలో 3.8, పెనుమూరు, పెద్దపంజాణిలో 1.4, శ్రీరంగరాజపురంలో 1.2, బైరెడ్డిపల్లెలో 0.5 మి.మీ వర్షపాతం నమోదైంది.



ట్రాక్టర్ నడిపి.. ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్, ఎంపీ ప్రసాదరావు - ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న రైతులు



రైతుల శ్రేయస్సే ధ్యేయం

- ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతు శ్రేయస్సే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు తెలిపారు. అన్నదాత సుఖీభవ నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమైనందుకు కృతజ్ఞతగా విజయపురం, నింద్ర, నగరి, పుత్తూరు, వడమాలపేటకు చెందిన రైతులు నగరిలో ట్రాక్టర్ల ర్యాలీ నిర్వహించారు. ఓంశక్తి ఆలయంలో పూజలు చేశాక, ట్రాక్టర్ నడుపుతూ ర్యాలీని ఎమ్మెల్యే, ఎంపీ ప్రారంభించారు. మార్కెట్ యార్డు వరకు ఈ ర్యాలీ సాగింది. నగరి టవర్‌క్లాక్ వద్ద ఎన్టీఆర్, ముద్దుకృష్ణమ విగ్రహాలకు నాయకులు, రైతులు కలిసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం మార్కెట్ యార్డులో జరిగిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ.. ఎన్నడూ లేనివిధంగా మామిడి రైతులను కూటమి ప్రభుత్వం ఆదుకుందని చెప్పారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం చంద్రబాబు మాటిస్తే నిలబెట్టుకుంటారని ప్రశంసించారు.నగరి పట్టణ అధ్యక్షుడు గుణశేఖర్, మండల అధ్యక్షుడు జవహర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ బాలాజీ, మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్, నాయకులు వెంకటేశ్వరరావు, రమేష్‌రాజు, అరవ బాలాజీ, వేణు, శ్రీనివాసన్, శివ, రవినాయుడు, షణ్ముగంరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, సురేష్‌నాయుడు, కుమార్‌నాయుడు, మీరా, హేమావతి, సంపూర్ణమ్మ, శ్రీధర్, సలీమ్ చిట్టిబాబు, రమేష్‌బాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే మురళీమోహన్ - ట్రాక్టర్లతో ర్యాలీ

రైతుల కష్టం తెలిసిన నాయకుడు చంద్రబాబు

ఎమ్మెల్యే మురళీమోహన్

పూతలపట్టు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల కష్టం తెలిసిన నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ అన్నారు. పూతలపట్టులో అన్నదాత సుఖీభవ నిధులు రైతులకు జమ కావడంపై కృతజ్ఞతలు తెలుపుతూ.. గురువారం రైతులు, టీడీపీ నాయకులు భారీ ట్రాకర్ల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రంగంపేట క్రాస్‌రోడ్డు నుంచి పూతలపట్టు - కాణిపాకం ఆర్చి వరకు సాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతుల భవిష్యత్తు కూటమి ప్రభుత్వం ప్రధాన కర్తవ్యమన్నారు. అలాగే పులివెందుల, ఒంటిమిట్టలో జడ్పీటీసీ స్థానాలను టీడీపీ కైవసం చేసుకోవడతో నాయకులు స్వీట్లు పంచుకుని, బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు యువరాజులు నాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, చిత్తూరు పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, నాయకులు గంగారపు హరి, ఎన్‌పీఎస్ ధరణి, చిత్ర, గణపతి నాయుడు, ప్రతాపనేని చంద్రమౌళి, బాబురావు, చిరంజీవి నాయుడు, హిమకర్, జగన్నాథం, మధు, బాబు, నరసింహులు, ఏకాంబరంతో పాటు నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చిత్తూరు ఏఎంసీ ఖరారు



ఉత్తర్వుల కాపీని ఎమ్మెల్యే జగన్మోహన్‌కు అందజేస్తున్న కార్యదర్శి ఇందుమతి

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) ఖరారైంది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే జగన్మోహన్, చైర్‌పర్సన్‌గా వి.ఝాన్సీరాణి, వైస్ చైర్‌పర్సన్‌గా టి.అనురాధ నియమితులయ్యారు. సభ్యులుగా సి.రామమూర్తి, ఏజీ నాయుడు, జి.రవి, ఎం.నందిని, వి.నాగరాజన్, కేబీ జయపాలన్, సయ్యద్ ఫిరోజ్, ఎంజీ హేమచంద్ర, ఎ.అంజలి, ఎం.మీనాక్షి, కె.గౌరి, ఇ.గోవిందస్వామినాయుడు, ఎ.మోహన్‌నాయుడు, గుడిపాల సింగిల్‌విండో అధ్యక్షుడు, ఏడీ అగ్రికల్చర్ (చిత్తూరు), మేయర్ అముద, జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారిని ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన ఉత్తర్వుల కాపీని ఎమ్మెల్యేకు మార్కెట్ కమిటీ కార్యదర్శి ఇందుమతి గురువారం అందజేశారు.

పెనుమూరు ఏఎంసీ..



అరుల్‌నాథన్ - ప్రసాదరెడ్డి

పెనుమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) కూడా ఖరారైంది. గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్యే థామస్, అధ్యక్షుడిగా ఈ.కృష్ణమనాయుడు (జీడీనెల్లూరు-టీడీపీ), వైస్ చైర్మన్‌గా అరుల్‌నాథన్ (పాలసముద్రం -టీడీపీ), సభ్యులుగా ప్రసాద్‌రెడ్డి, ఎన్.సుబ్రహ్మణ్యం నాయుడు, ఎం.శ్యామల, ఎం.భార్గవి, (పెనుమూరు-టీడీపీ), ఎం.రేణుక (పెనుమూరు-జనసేన), బి.జ్యోతి (పాలముద్రం-టీడీపీ), డి.లోకమ్మ, ఎన్.దేవరాజులు, ఎం.కోదండరెడ్డి, ఎం.నియాజ్, వి.గ్రీష్మ, కె.చారుమతి, (జీడీనెల్లూరు-టీడీపీ), ఎల్.అరుణ (జీడీనెల్లూరు-బీజేపీ)తోపాటు పెనుమూరు సింగిల్‌విండో అధ్యక్షుడు, అగ్రికల్చర్ ఏడీ (చిత్తూరు), పెనుమూరు పంచాయతీ సెక్రటరీ, వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి (చిత్తూరు) ఉంటారు.

జాతీయ రహదారి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

నగరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట - చెన్నై, చిత్తూరు - తచ్చూరు జాతీయ రహదారి పనులను కలెక్టర్ సుమిత్‌కుమార్ గురువారం పరిశీలించారు. విస్తరణలో పలు ఆలయాలు, ఇళ్లు, పాఠశాలలు తొలగించాల్సి రావడం, టోల్‌ప్లాజా ఏర్పాటుపై బాధితుల నుంచి పలు వినతులు రావడంతో కలెక్టర్ క్షేత్రస్థాయిలో ఆరా తీశారు. నెత్తంకండ్రిగ, వీకేఆర్‌పురం ప్రాంతాల్లో రహదారి మ్యాప్‌లను పరిశీలించి.. అధికారులు, జాతీయ రహదారి సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ.. ఇప్పటికే 200 మీటర్ల మేర స్థలం వదిలామని ఇంకా ఐదు మీటర్లు కావాలంటున్నారని, అలా చేస్తే తాము తీవ్రంగా నష్టపోతామని చెప్పారు. దీనిపై సంబంధిత అధికారులతో మాట్లాడతామని కలెక్టర్ తెలిపారు. చిత్తూరు ఆర్డీవో అనుపమ, డీఎస్పీ అజీజ్, తహసీల్దార్ రవికుమార్, సర్వేయర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాన్వీ సందడి

తల్లి శ్రీదేవి పుట్టిన రోజున బాలీవుడ్ హీరో సిద్ధార్థ్ మల్హోత్రతో కలిసి గురువారం తిరుమల శ్రీనివాసుడిని జాన్వీకపూర్ దర్శించుకున్నారు.

పసిబిడ్డగా తాను తల్లిదండ్రులతో కలిసి తిరుమలలో తీసుకున్న ఫోటోను ఇన్‌స్టా ప్రొఫైల్ పిక్‌గా పెట్టుకున్నారు.



చిత్తూరులో పెట్టుబడులకు మంచి అవకాశాలు : కలెక్టర్

● న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలంలో వాణిజ్య, గృహ సముదాయాల ప్రాజెక్టుకు భూమి పూజ



భూమి పూజలో పాల్గొన్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎమ్మెల్యే జగన్మోహన్ తదితరులు

చిత్తూరు సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులో పెట్టుబడులు పెట్టడానికి మంచి అవకాశాలు ఉన్నాయని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. గురువారం నగరంలోని న్యూట్రిన్ ఫ్యాక్టరీ స్థలంలో ఆధునిక హంగులతో నిర్మించనున్న 'ఎస్ అవెన్యూ' వాణిజ్య, గృహ సముదాయాల ప్రాజెక్టుకు ఎమ్మెల్యే జగన్మోహన్, ఎన్ఆర్ఐ కొండా నరేంద్రతో కలిసి కలెక్టర్ భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రైవేటు పెట్టుబడులను స్వాగతిస్తున్నామని చెప్పారు. వీరి స్ఫూర్తితో మరింత మందిముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తంబళ్లపల్లెకు చెందిన ఎన్ఆర్ఐ మిత్రుడు కొండా నరేంద్రతో కలిసి ప్రపంచ స్థాయి షాపింగ్ మాల్స్, హోటల్స్, గృహ సముదాయాల నిర్మాణాలను చేపట్టనున్నామన్నారు. దీనివల్ల స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. రానున్న రోజుల్లో అభివృద్ధికి కేంద్రంగా చిత్తూరు మారనుందన్నారు. నరేంద్ర మాట్లాడుతూ.. అందరి సహకారంతో చిత్తూరును మరింత అభివృద్ధి చేస్తామన్నారు. మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ కఠారి హేమలత, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నాయకులు గురజాల చెన్నకేశవులు నాయుడు, సునీల్‌కుమార్, కాజూరు బాలాజి, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

కల్లూరులో కొనసాగుతున్న గజదాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడి చెట్లు

కల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్నేళ్ల క్రితం నాటిన కొబ్బరి, మామిడి చెట్లు ఏనుగుల గుంపు దాడుల్లో నేలమట్టమవుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పండించిన వరి, వేరుశనగ, టమోటా, వంగ పంటలకు తీవ్రనష్టం వాటిల్లుతోంది. మండలంలో మూడేళ్లుగా కొనసాగుతున్న ఏనుగుల గుంపు దాడులతో వ్యవసాయంపైనే ఆసక్తి లేకుండా పోతోందని మండల రైతులు వాపోతున్నారు. బుధవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు సైదుల్లా గుట్టవద్దకు చేరుకున్నాయి. అక్కడి నుంచి అటవీ సరిహద్దులోని మామిడితోటల్లోకి చేరుకొని పంటలపై దాడులు కొనసాగించాయి. కల్లూరులోని మలంగ్‌షా, సయ్యద్ బాషా, నౌషాద్, ఖాదర్‌వల్లికి చెందిన మామిడి, కొబ్బరి, సపోటా, పనస, కందిపంటలను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. ధ్వంసమైన పంటలకు నష్ట పరిహారం చెల్లించాలని రైతులు కోరుతున్నారు. గురువారం పగలంతా అటవీ ప్రాంతంలోని బోదబండ, నూరురాళ్లగుట్ట వద్ద ఏనుగుల గుంపు సంచరిస్తున్నట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

20న పేటమిట్టలో జాబ్‌మేళా

పూతలపట్టు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన పూతలపట్టు మండలం పేటమిట్టలోని అమరరాజా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో జాబ్‌మేళా జరగనుంది. దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం తన కార్యాలయంలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో 25 కంపెనీలు పాల్గొంటాయని, 1,200 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థుల కోసం 20వ తేదీన ఉదయం తొమ్మిది గంటల నుంచి తలపులపల్లె, రంగంపేట క్రాస్ రోడ్డు వద్ద ఉచిత బస్సులను ఏర్పాటు చేస్తామని చెప్పారు. డీఎస్డీవో గుణశేఖర్ రెడ్డి, టీడీపీ నాయకులు ఎన్‌పీ ధరణీనాయుడు, మురార్జి, వెంకటేష్ రబీ, విజయేంద్ర యాదవ్, ప్రతాపనేని చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐఎంసీ పరీక్షలో పలమనేరు విద్యార్థిని ప్రతిభ



దర్శినిప్రియ

పలమనేరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పట్టణం కొత్తపేటలో నివాసముంటున్న ఎస్.పవన్‌కుమార్, కె.అమృత దంపతుల చిన్నకుమార్తె ఎస్.దర్శిని ప్రియ ఆర్.ఐ.ఎం.సీ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించింది. పలమనేరు సమీపంలోని ఈమాస్స్విస్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. డెహ్రాడూన్‌లోని రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కళాశాల(ఆర్.ఐ.ఎం.సీ)లో 2026 జనవరిలో ప్రవేశాలకు జరిగిన పరీక్షలో ప్రతిభ చూపింది. తల్లి అమృత బంగారుపాళ్యం మండలం మొగిలి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్నారు. తల్లి శిక్షణతోనే పరీక్షల్లో విజయం సాధించినట్లు దర్శిని తెలిపింది.


తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్య



ఉపేంద్ర (ఫైల్ ఫొటో)

బంగారుపాళ్యం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సీఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. బంగారుపాళ్యం మండలంలోని వెలుతురుచేనుకు చెందిన వేలు కుమారుడు ఉపేంద్ర(18) పదో తరగతి వరకు చదుకుని ఇంటి వద్దే ఉంటూ గొర్రెలు మేపేవాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు మందలించారని మనస్తాపంతో గొర్రెలు దొడ్డిలో గురువారం ఉరేసుకున్నాడు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

వి.కోటలో టోల్‌ప్లాజా ప్రారంభం



టోల్ ప్లాజాను ప్రారంభిస్తున్న నేషనల్ హైవే అధికారులు

వి.కోట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వి.కోట మండలం బోయచిన్నాగనపల్లె పంచాయతీ పరిధి రామనాథపురం వద్ద మంగళూరు - తిరువణ్ణామలై మార్గంలోని జాతీయ రహదారిపై ఎన్‌హెచ్ ఈఈ శ్రీనివాసులు చేతుల మీదుగా గురువారం టోల్‌ప్లాజాను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ డీఈ, ఏఎంసీ మాజీ చైర్మన్ రామచంద్రనాయుడు, ప్రాజెక్టు మేనేజర్ రామచంద్రారెడ్డి, సిబ్బంది మోహిత్, రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

పూలతోటలో కొండ చిలువ ప్రత్యక్షం



పూల తోటలో ప్రత్యక్షమైన కొండ చిలువ

సదుం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొర్లకుంటవారిపల్లెకు చెందిన నాగభూషణం కనకాంబరం పూల తోటలో గురువారం ఉదయం భారీ కొండ చిలువ ప్రత్యక్షమైంది. నాగభూషణం భార్య అనూరాధ ఉదయం 7 గంటలకు తోటలో పూలు కోస్తుండగా ఆమె రెండు కాళ్లను కొండ చిలువ చుట్టేయడంతో భయభ్రాంతులకు గురై గట్టిగా కేకలు వేసింది. పరిసర ప్రాంతాల్లోని వారు చేరుకుని కొండ చిలువను కొట్టి చంపి ఆమెను విడిపించారు. గ్రామం అటవీ శివారులో ఉండటంతో తరచూ పాముల ప్రమాదం ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు.

గడ్డంవారిపల్లె సర్పంచ్‌కు ఢిల్లీ ఆహ్వానం



ఆహ్వాన పత్రికను చూపుతున్న గడ్డంవారిపల్లె సర్పంచ్ భాగ్యవతి దంపతులు

చౌడేపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరుగుతున్న స్వాతంత్ర్య దినోత్సవం వేడుకలకు గడ్డంవారిపల్లె సర్పంచ్ భాగ్యవతి దంపతులకు ఆహ్వానం అందినట్లు గురువారం ఆమె తెలిపారు. మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీలో వాటర్‌షెడ్ పథకాలను విజయవంతంగా నిర్వహించడంతో జలశక్తి అభియాన్ మంత్రిమండలి నుంచి ఆహ్వానం అందడంతో తన భర్త హరితో కలిసి ఢిల్లీ చేరుకున్నట్లు పేర్కొన్నారు.

'పీజీఆర్ఎస్' అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి : జేసీ



రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జేసీ విద్యాధరి ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, మండల అధికారులతో వర్చువల్ విధానంతో రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ప్రతి అర్జీని గడువులోగా.. రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా పరిష్కరించాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గురువారం వరకు పీజీఆర్ఎస్ ద్వారా 60,053 అర్జీలు స్వీకరించడం జరిగిందన్నారు. స్పెషలాఫీసర్లు మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వాస్పత్రులను తనిఖీలు చేసి.. సమస్యలను గుర్తించాలని సూచించారు. అభివృద్ధి పనులను పరిశీలించి నివేదిక అందించాలన్నారు. బైరెడ్డిపల్లె, గంగవరం, పూతలపట్టు మండలాల నుంచి వచ్చిన వినతులను విద్యుత్‌శాఖ అధికారులు ఎలా పరిష్కరించారో ఆరా తీశారు. పది ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో దశలవారీగా ఉచిత వైద్యసేవలు అందించడానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని డీఎంహెచ్‌వో, డీసీహెచ్‌వోలను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, అన్నిశాఖల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

రోడ్డు పనులు ప్రారంభం


రాళ్లబూదుగూరులో వేస్తున్న సీసీ రోడ్డు

శాంతిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని కనమలదొడ్డి నుంచి రాళ్లబూదుగూరు మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు తారురోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4.05 కోట్ల నిధులను మంజూరు చేసింది. దీంతో కాంట్రాక్టర్ గురువారం పనులను ప్రారంభించారు. రాళ్లబూదుగూరు గ్రామంలో సుమారు 500 మీటర్లకు పైగా సీసీ రోడ్డు పనులు చేపడుతున్నారు. ఆ తర్వాత తారురోడ్డు తారు రోడ్డు పనులు చేపడుతారని రాళ్లబూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి తెలిపారు. ఈ నెల చివరికల్లా పనులు పూర్తి చేస్తారని పేర్కొన్నారు. రోడ్డు పనులు చేపట్టడంతో ప్రజలు సంతోసం వ్యక్తం చేస్తున్నారు.

పాత బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు


మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులు చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపునకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పుంగనూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి అన్నారు. రొంపిచెర్లలో గురువారం పలుశాఖల అధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. 2014-2019 మధ్యకాలంలో అభివృద్ధి పనులు చేపట్టిన వారికి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో ఆర్థికంగా నష్టపోయారని .. వారి కష్టాలను గుర్తించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాత బిల్లులు చెల్లించేందుకు నిర్ణయం తీసుకున్నారన్నారు. పాత బిల్లులు చెల్లించేందుకు పూర్తి వివరాలను అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఉపాధిహామీ ఏపీడీ శ్రీనివాసులు పెండింగ్ బిల్లుల వివరాలను చల్లా దృష్టికి తీసుకెళ్లారు. సమావేశంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, సోమల, సదుం, పులిచెర్ల మండల టీడీపీ అధ్యక్షులు సుబ్రహ్మణ్యంనాయుడు, ప్రసాద్‌రెడ్డి, ధనంజయనాయుడు, సోమల సింగిల్‌విండో అధ్యక్షుడు శివశంకర్, పుంగనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ శమీపతి, సీవీరెడ్డి, మాజీ సర్పంచులు రవికుమార్‌నాయుడు, ఓబులేశ్వరరెడ్డి, మాజీ వైస్ఎంపీపీ ఉమాపతి నాయుడు, నాయకులు రాజు, వేణుగోపాల్ నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు

వైద్యసిబ్బందికి ఆటల పోటీలు



బైరెడ్డిపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి సంబంధించిన వైద్యసిబ్బందికి స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహించారు. వైద్యసిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విజేతలకు శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని వైద్యాధికారి విజయచందర్ తెలిపారు.

రెస్కో డైరెక్టర్లుగా ముగ్గురికి అవకాశం


బసవరాజు, శరవణకుమార్


అనుసూయ

శాంతిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురం మండలం నుంచి రెస్కో డైరెక్టర్లుగా ముగ్గురికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సహకారంతో ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి రెస్కో కమిటీని బుధవారం ప్రకటించారు. రాళ్లబూదుగూరు గ్రామానికి చెందిన బసవరాజు, చిన్నారిదొడ్డికి చెందిన శరవణకుమార్ (చలపతి), గుండిశెట్టిపల్లెకు చెందిన అనుసూయకు మండలం నుంచి అవకాశం కల్పించారు. అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్ మునిరత్నం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడులకు రెస్కో డైరెక్టర్లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏఎంసీ డైరెక్టర్లకు అభినందనలు


శ్యామల, చంద్రకళ


అనిత

శాంతిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శాంతిపురం మండలానికి చెందిన ముగ్గురికి ప్రభుత్వం కుప్పం ఏఎంసీ డైరెక్టర్లుగా అవకాశం కల్పించింది. ప్రభుత్వం బుధవారం ప్రకటించిన మార్కెట్ కమిటీలో శివరామపురం గట్టూరు గ్రామానికి చెందిన శ్యామల, ఎంకేపురం గ్రామానికి చెందిన చంద్రకళ, చిన్నారిదొడ్డి పంచాయతీ ఎస్ గొల్లపల్లె గ్రామానికి చెందిన అనితలకు అవకాశం కల్పించారు. ఏఎంసీ డైరెక్టర్లకు గురువారం వ్యవసాయ మార్కెట్ సిబ్బంది కలిసి అభినందించారు. ఏఎంసీ సభ్యులుగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రితోపాటు ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

విస్తరణ పనులకు రహదారి పరిశీలన


రామకుప్పం ప్రధాన రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

రామకుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రామకుప్పం ప్రధాన రహదారి విస్తరణకు మోక్షం కలిగింది. కడ పీడీ వికాస్‌మర్మత్ ఆదేశాలతో గురువారం వివిధ శాఖల అధికారులు, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి రామకుప్పం ప్రధాన రహదారిని పరిశీలించారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి మాట్లాడుతూ రామకుప్పం పట్టణ సుందరీకరణ, ప్రజల సౌకర్యార్థం చేపడుతున్న రహదారి విస్తరణ పనులకు స్థానికులు సహకరించాలన్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డుతోపాటు 50 అడుగుల మేర రహదారి విస్తరణ చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. రహదారి విస్తరణలో స్థలాలు, భవనాలు కోల్పోయే వారికి ప్రభుత్వం నష్టపరిహారం అందించి అండగా నిలుస్తుందని వివరించారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం


జగదీశ్‌ను సన్మానిస్తున్న తులసీనాథ్, కాశీనాథ్

కుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు జగదీశ్ నాయుడిని గురువారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, కుప్పం రెస్కో డైరెక్టర్ ఎన్ఎస్.తులసీనాథ్, కుప్పం ప్రభుత్వాస్పత్రి కమిటీ సభ్యుడు కాశీనాథ్‌లు కలిశారు. భారతీయ జనతాపార్టీ తమ సేవలను గుర్తించి నామినేటెడ్ పదవులు వచ్చేందుకు కృషి చేసిన జగదీశ్‌నాయుడిని సన్మానించి ధన్యవాదాలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి మరింత పాటుపడుతామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ పార్టీకి పనిచేసిన కార్యకర్తలకు ఎప్పుడూ తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు.

ఢిల్లీలో నారాయణస్వామికి నివాళి


నారాయణస్వామికి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, కుటుంబసభ్యులు

రామకుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీభవన్ వద్ద ప్రోటోకాల్ అధికారి నారాయణస్వామికి గురువారం కుటుంబసభ్యులతోపాటు రామకుప్పం, శాంతిపురం మండలాల టీడీపీ నేతలు ఘనంగా నివాళులర్పించారు. నారాయణస్వామి శాంతిపురం మండలం బెండనకుప్పానికి చెందిన వారు కావడం.. గత ఏడాది స్వగ్రామం సమీపంలో రోడ్డుప్రమాదంలో చనిపోయారు. దీంతో ఢిల్లీ ఏపీభవన్ వద్ద కుటుంబసభ్యులతోపాటు టీడీపీ నేతలు ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామకుప్పం సింగిల్ విండో అధ్యక్షుడు మహ్మద్ రఫీ, మాజీ సర్పంచులు మహాదేవి, జయశంకర్, ఎల్లప్ప, నేతలు స్పందన, బాబు తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్

బైరెడ్డిపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని గురువారం జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ తనిఖీ చేశారు. మలేరియా, డెంగీ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్యసిబ్బందికి తగు సూచనలిచ్చారు. రికార్డులు పరిశీలించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి విజయచందర్, డాక్టర్ షాలిని, సబ్‌యూనిట్ అధికారి జయశంకర్, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): అధికారులు గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని.. దోమలు విపరీతంగా ఉన్నాయని. ఇందుకు వెంటనే చర్యలు చేపట్టాలని ఎంపీపీ పురుషోత్తంరెడ్డి అన్నారు. గురువారం రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మృతిచెందిన జాండ్లవారిపల్లె సర్పంచ్ నాగిరెడ్డికి సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ పెద్దగొట్టిగల్లు వద్ద పోరంబోకు స్థలంలో జాతీయ రోడ్డు విస్తరణకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు ఇళ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. ఏవో శ్రావణి మాట్లాడుతూ మండలంలో 4,347 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందారన్నారు. పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. వైద్యాధికారి దినేష్‌కుమార్ మాట్లాడుతూ గత మార్చి నుంచి 25 మంది కుక్కకాటుకు గురయ్యారని... కుక్కలకు ఏఆర్‌వీ వ్యాక్సిన్ వేయించాలన్నారు. సమావేశంలో జడ్పీటీసీ రెడ్డీశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ విజయశేఖర్, ఎంపీడీవో మాధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ అమరనాథ్, పశువైద్యాధికారి ఉషా, ఏపీవో బాలమురళీ, సీడీపీవో వాణిశ్రీదేవి, ఎంఈవో ఇందిర, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

తండ్రి రామకృష్ణారెడ్డికి ఎమ్మెల్యే నివాళి


తండ్రి సమాధి వద్ద సోదరుడితో కలిసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి మండలం కెళవాతి గ్రామంలో చిత్తూరు మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డి 16వ వర్ధంతిని గురువారం నిర్వహించారు. సమాధి వద్ద తనయులు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, శ్రీనాథరెడ్డి పూజలు చేపట్టి నివాళులర్పించారు. పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంట పొలాలకు దారిసౌకర్యం కల్పించాలి


రహదారిపై పాడిఆవులను తీసుకొచ్చి నిరసన తెలుపుతున్న రైతులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తమ పంట పొలాలకు వెళ్లడానికి దారిసౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం మండలంలోని కామినేపల్లె గ్రామానికి చెందిన రైతులు రహదారిపై పాడిఆవులను తీసుకొచ్చి నిరసన తెలిపారు. కామినేపల్లె గ్రామ సమీపంలో ఎక్స్‌ప్రెస్ హైవే రహదారి వెళుతుండటంతో పంటపొలాలకు వెళ్లడానికి దారిలేకుండా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పొలాలకు వెళ్లడానికి దారిసౌకర్యం కల్పించాలని రైతులు కోరారు.

పెద్దపంజాణి సింగిల్‌విండో చైర్మన్‌గా శ్రీరాములు


పీఏసీఎస్ చైర్మన్‌గా శ్రీరాములుచే ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పెద్దపంజాణి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెద్దపంజాణి సింగిల్‌విండో చైర్మన్‌గా శ్రీరాములుచే పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేయించారు. స్థానిక తహసీల్దారు కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై చైర్మన్‌గా శ్రీరాములు, డైరెక్టర్లుగా గంగప్ప, హరినాథ్‌లచే ప్రమాణం చేయించారు. రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని.. రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయభాస్కరరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి మురహరిరెడ్డి, సీఈవో రామరాజు, నాయకులు నాగరాజరెడ్డి, రోజారెడ్డి, బుద్దు, చలపతి, సర్పంచ్ రుద్రమూర్తినాయుడు, రమేష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తాపడి యువకుడి మృతి


రవితేజ (ఫైల్ ఫొటో)

చౌడేపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ట్రాక్టర్ బోల్తాపడి ఓ యువకుడు మృతిచెందిన సంఘటన చౌడేపల్లె మండలంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ నాగేశ్వరరావు కథనం మేరకు.. మండలంలోని చారాల పంచాయతీకి చెందిన బాలసుబ్రహ్మణ్యం కుమారుడు రవితేజ(25) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గ్రామ సమీపంలోని గొల్లావానికుంట చెరువు వద్ద ఓ రైతు పొలం దున్నేందుకు వెళ్లాడు. పొలం దున్ని మరో రైతు పొలం దున్నేందుకు గొల్లావానికుంట చెరువు కట్టపైకి ట్రాక్టర్‌ను ఎక్కిస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో డ్రైవర్ రవితేజ తీవ్రంగా గాయపడటంతో కుటుంబ సభ్యులు పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్సలు పొందుతూ మృతిచెందాడు.

పుంగనూరులో పేదలకు అన్నదానం


పుంగనూరులో అన్నదానం చేస్తున్న అభిమానులు

పుంగనూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మాజీ పార్లమెంటు సభ్యుడు నూతనకాల్వ రామకృష్ణారెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన అభిమానులు పుంగనూరులో అన్నదానం చేశారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సర్కిల్‌లో రామకృష్ణారెడ్డి, దివంగత ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మధుసూదన్‌రాయల్, వెంకటరమణ, నూర్, సుబ్రహ్మణ్యం, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● **చౌడేపల్లె :** మాజీ ఎంపీ దివంగత రామకృష్ణారెడ్డి వర్ధంతిని గురువారం చౌడేపల్లెలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండులో అన్నదానం చేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు విజయభాస్కర్‌రెడ్డి, బాబునాయుడు, రమేష్, కుమార్‌రెడ్డి, వెంకటరమణ పాల్గొన్నారు.

వైభవోపేతంగా మహాకుంభాభిషేకం వేడుకలు


మహా కుంభాభిషేకం వేడుకలో కలశాలను తీసుకొస్తున్న భక్తులు

కల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం కల్లూరులో నూతనంగా నిర్మించిన కాశీవిశ్వేశ్వరస్వామి, వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో గురువారం వైభవోపేతంగా మహా కుంభాభిషేకం వేడుకలు నిర్వహించారు. భక్తులకు ఆలయ ప్రధాన అర్చకులు రాజశేఖర్ దీక్షితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రథంపై ఊరేగిన సుబ్రహ్మణ్యుడు

గుడుపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గుడివంక కొండపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయ ఆడికృతిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం కనులపండువగా జరిగింది. మహిళలు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి మొక్కుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

టీడీపీ నేతల సంబరాలు

శాంతిపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధించడంతో శాంతిపురం తెలుగు తమ్ముళ్లు గురువారం మండల పార్టీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథనాయుడు ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గోపాల్, రెస్కో డైరెక్టర్ శరవణకుమార్ (చలపతి), టీడీపీ నేతలు రమేష్ కేదరనాథ్, బాలకృష్ణ, గణేష్, యూనిట్ ఇన్‌చార్జీలు బాలు, రమేష్‌రెడ్డి, శివకుమార్, అర్జునప్ప, బాబు, వెంకటపతి, దుబాయిగౌడు పాల్గొన్నారు.

● **వి.కోట:** పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గెలుపుతో వి.కోటలో ఆ పార్టీ నేతలు గురువారం సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో బాణసంచా పేల్చి, స్వీట్లు పంచి పెట్టారు. టీడీపీ మండలాధ్యక్షులు రంగనాథ్ , మండల పార్టీ ప్రధాన కార్యదర్శి ఈశ్వర్, తెలుగు యువత అధ్యక్షులు ధీరజ్, జిల్లా తెలుగు యువత కార్యదర్శి శబరీష్, పీఏసీఎస్ అధ్యక్షులు నారాయణస్వామి, హరినాథరెడ్డి, నాయకులు నాగభూషణం, విశ్వనాథ్, ఇక్బాల్, మూర్తి, గౌస్‌పీర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

17న బైరెడ్డిపల్లెలో రక్తదాన శిబిరం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 17న ఉదయం 9 గంటలకు మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వారిచే రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మెగా వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

18న బైరెడ్డిపల్లె మండల సమావేశం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 18న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బైరెడ్డిపల్లె మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేంద్రబాలాజీ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి


మధ్యాహ్న భోజనం రుచి చూస్తున్న ఎస్ఈ విజయకుమార్, ఎంపీడీవో తదితరులు

చౌడేపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ విజయకుమార్ సూచించారు. గురువారం ఆయన మండలంలోని పుదిపట్ల, చౌడేపల్లె హైస్కూల్, బాలుర హాస్టల్, అంగన్‌వాడీ కేంద్రం, సచివాలయాలను తనిఖీ చేశారు. అలాగే పుదిపట్ల హైస్కూల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఈఈ సోమశేఖర్, శ్రీనివాసులు, ఎంపీడీవో లీలామాధవి, ఏఈఈ సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు

రామకుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణంలో గణేష్ ఉత్సవాలు, సుబ్రహ్మణ్యస్వామి సోమవారోత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా ప్రతిఒక్కరూ సహకరించాలని కుప్పం డీఎస్పీ పార్థసారథి, రూరల్ సీఐ మల్లేష్‌యాదవ్ కోరారు. గురువారం రాత్రి రామకుప్పం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన పీస్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ ఉత్సవాల సందర్భంగా గొడవలు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో నేతలు సీతాపతి, రామకృష్ణప్ప, సలాంసాబ్, పద్మనాభరెడ్డి, దయానంద్, నరసింహులు, ఆదిల్, నిసార్, మణీంద్రంనాగరాజు, చాన్‌బాషా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

17న రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

పుంగనూరు రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న పుంగనూరులో మాలలు ప్రారంభించే రాజ్యాంగ పరిరక్షణ యాత్రను విజయవంతం చేయాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ ప్రజాభవన్‌లో ఆయన మాట్లాడుతూ ఈనెల 3న కుప్పం నుంచి శ్రీకాకుళం వరకు పాదయాత్ర చేయాల్సి ఉండగా ప్రభుత్వం అనుమతులు ఇవ్వకపోవడంతో హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. హైకోర్టు అనుమతులతో పాదయాత్రను ప్రారంభించనున్నట్లు చెప్పారు. సమావేశంలో మాలమహానాడు నాయకులు చంద్ర, మల్లెల మోహన్, శేషాద్రి, మణి, రెడ్డిప్రసాద్, శ్రీనివాసులు, సురేశ్, రెడ్డిశేఖర్, భాస్కర్ పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

పుంగనూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులో శుక్ర, శనివారం రోజుల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు గురువారం ఆలయ నిర్వాహకులు తెలిపారు. స్థానిక కృష్ణమరెడ్డిపల్లె రోడ్డులోని రుక్మిణి సత్యభామ సమేత శ్రీకృష్ణ ఆలయంలో 15న రాత్రి 7 గంటలకు శ్రీకృష్ణ భగవానుడికి ఉయ్యాలసేవ, 16న ఆలయంలో అభిషేకాలు, గోపూజ జరుగుతుందని పేర్కొన్నారు.

విద్యతోనే వికాసం

చౌడేపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోనే వికాసం సాధ్యమని ఎంఈవోలు కేశవరెడ్డి, తిరుమలమ్మ అన్నారు. గురువారం స్థానిక బాలికల జూనియర్ కళాశాలలో జరిగిన ఫ్రెషర్స్‌డే సమావేశంలో వారు మాట్లాడారు. బాలికలు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని, అన్ని రంగాలలో ముందుండాలని, ప్రభుత్వం మధ్యాహ్న భోజనం, విద్యాసామాగ్రి అందిస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజరెడ్డి, ఉపాధ్యాయులు పరిమళ, ఆనంద్, శ్రీనివాసులు, మురళి, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

చౌడేపల్లె, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని.. సబ్ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి ఆనందం అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అంతకుముందు ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సీఈవో మునిరాజ, మురళీ మోహన్, చిన్నరెడ్డప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

తూతూ మంత్రంగా మండల సమావేశం

బంగారుపాళ్యం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఎంపీడీవో కార్యాలయంలో గురువారం బంగారుపాళ్యం మండల సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. ఎంపీపీ అమరావతమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీటీసీ, సర్పంచులు హాజరయ్యారు. ప్రజా సమస్యలపై ప్రజాప్రతినిధులు నోరు మెదపలేదు. దాంతో అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికను చదివి ముగించారు. ఏవో భారతి, విద్యుత్ శాఖ ఏఈ హేమచంద్రుడు, అటవీశాఖ అధికారి మోహన్ మురళి, పీఆర్ ఏఈ కృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సేతుమాధవ్ ప్రసంగించారు. ఈ జడ్పీటీసీ సోమశేఖర్, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు హేమచంద్రనాయుడు,తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, ఎంపీడీవో మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామి, నాగాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠ



ఐరాల, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): గార్గేయి నదీ తీరాన మఠంపల్లెమిట్టలోని భద్రకాళీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయ ఆవరణంలో సుబ్రహ్మణ్యస్వామి, నాగాలమ్మ విగ్రహాల ప్రతిష్ఠను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి యబ్బూరి సిద్ధయ్యశెట్టి, కుటుంబీకులు దాతలుగా వ్యవహరించారు.

రేపు కాళభైరవాష్టమి పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వరాలయంలో శనివారం కాళభైరవ ట్రస్టు ఆధ్వర్యంలో కాళభైరవాష్టమి పూజలు నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన కరపత్రాలను ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకటేషన్ గురువారం ఆలయ ప్రాంగణంలో అర్చకుడు శివకుమార్‌తోకలిసి ఆవిష్కరించారు.

కార్వేటినగరంలో కొత్త పరిశ్రమ స్థాపనకు చర్యలు

● ప్రభుత్వ విప్ థామస్ వెల్లడి



థామస్‌కు వినతిపత్రమిస్తున్న శ్రీహరిరాజు తదితరులు

వెదురుకుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలో కొత్త పరిశ్రమ స్థాపనకు చర్యలు చేపట్టామని ప్రభుత్వ విప్ థామస్ వెల్లడించారు. చెన్నైలో ఉన్న తనను టీకేఎంపేటకు చెందిన శ్రీహరి రాజు (క్లాసిక్ టూల్స్ అండ్ యాక్సెసరీస్ ఇండస్ట్రీ మేనేజింగ్ డైరెక్టర్, బెంగళూరు) గురువారం కలిసి పరిశ్రమ ఏర్పాటుకు ఆసక్తి చూపారన్నారు. దాంతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో మాట్లాడి ఈ సంస్థకు వంద ఎకరాల కేటాయింపునకు చర్యలు ప్రారంభించాలని కోరామన్నారు. సంస్థ ప్రతినిధులు హేమంత్, మహేష్, భరత్ ఉన్నారు.

సీపీవో తనిఖీలు

పెనుమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో సీపీవో శ్రీనివాసరావు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎంపీడీవో కిషోర్, డాక్టర్ శ్రీధర్‌బాబు, హెచ్‌ఎం యామిని తదితరులు పాల్గొన్నారు.

'డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల బదిలీలు చేపట్టాలి'

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలల్లో అధ్యాపకుల బదిలీలు చేపట్టాలని ఎస్వీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా కళాశాల అధ్యాపకులు గురువారం నిరసన తెలిపారు. ప్రభుత్వ కాలేజ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర జేఏసీ పిలుపుతో భోజన విరామ సమయంలో కళాశాల ముందు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తిరుకుమరన్, మహిళా కార్యదర్శి వినీల, అధ్యాపకులు ఉషారాణి, సంధ్యారాణి, షమ్సు అక్తర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపు

వెదురుకుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం డీఎంపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఉన్న పిచ్చిమొక్కలను గురువారం తొలగించారు. పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ త్యాగరాజు వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి : టీడీపీ



ట్రాక్టర్ల ర్యాలీలో పాల్గొన్న రాహుల్ , టీడీపీ నాయకులు, రైతులు

పెనుమూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమాని కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నాయకులు తెలిపారు. 'అన్నదాత సుఖీభవ' నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమైనందుకు కృతజ్ఞతగా గురువారం పెనుమూరు మండలంలోని పులిగుండు నుంచి పెనుమూరు బస్టాండు మీదుగా మార్కెట్ యార్డు వరకు ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. జీడీనెల్లూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల రైతులు, నాయకులు, పెనుమూరు ఏఎంసీ చైర్మన్ కృష్ణమనాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో ఎమ్మెల్యే థామస్ కుమారుడు రాహుల్ హాజరయ్యాడు. టీడీపీ అధ్యక్షులు రుద్రయ్యనాయుడు, జయశంకర్‌నాయుడు, స్వామిదాస్, చెంగల్రాయ యాదవ్, లోకనాథరెడ్డి, పార్లమెంటు యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, కార్యదర్శి తలారిరెడ్డెప్ప, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు కార్జాల అరుణ, రైతు నాయకులు నాగేశ్వర్‌రాజు, ఈశ్వర్‌ప్రసాద్, నాయకులు భాస్కర్, చిరంజీవిరెడ్డి, కృష్ణమూర్తినాయుడు, మోహన్‌నాయుడు, యువరాజులునాయుడు, ప్రసాద్‌రెడ్డి, మోహన్‌మురళీ, కిషన్‌చంద్, రజనీకాంత్, సురేష్, అశోక్, ఎన్‌ఎస్‌నాయుడు, హేమాద్రినాయుడు, చంద్రబాబు, చిరంజీవి, ఏకాంబరం, మునేంద్ర, విశ్వనాథరెడ్డి, రాజగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పలు పాఠశాలల్లో ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు గురువారం నిర్వహించారు. చిన్నారులు రాధాకృష్ణుల వేషధారణలతో సందడి చేశారు. ●చిత్తూరు బృందావన్ సీనియర్ సెకండరీ పాఠశాలలో ప్రిన్సిపాల్ శైలజకుమారి, డైరెక్టర్ ప్రియతేజ ఆధ్వర్యంలో,హార్వర్డ్‌స్కూల్లో కరస్పాండెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

పాలసముద్రం: అరుణోదయ పాఠశాలలో గురువారం ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. హెచ్‌ఎం సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ మురళిరాజు, టీచర్లు పాల్గొన్నారు.



బృందావన్ పాఠశాలలో..



హార్వర్డ్ స్కూల్లో ..



అరుణోదయ పాఠశాలలో..

బైక్‌ల ఢీ : ఇద్దరికి తీవ్రగాయాలు

పూతలపట్టు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో గురువారం ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పూతలపట్టుకు చెందిన ముబారక్ పని నిమిత్తం చిత్తూరుకు తన బైక్‌లో వెళ్తుండగా పూతలపట్టు సమీపాన ఉన్న కాణిపాకం ఆర్చ్ వద్ద ఉన్నట్లుండి మలుపు తిప్పడంతో వెనుక మరో బైక్‌లో ఉన్న తిరుమలయ్యగారిపల్లెకు చెందిన వెంకటేష్ ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను 108 వాహనంలో చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సీఐ కృష్ణమోహన్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు.

పేదలందరికీ సంక్షేమ ఫలాలు



కరపత్రాలు పంచుతున్న టీడీపీ నేతలు

నింద్ర, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నింద్రలో నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీవెళ్లి కరపత్రాలను అందజేశారు. నాయకులు భాస్కర్, సంపూర్ణమ్మ, ఆనంద్, పెరుమాళ్‌రెడ్డి, రమేష్, ప్రకాష్, కోదండరెడ్డి, రామకృష్ణ రాజు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే మురళీమోహన్



ఎమ్మెల్యేకి స్వాగతం పలుకుతున్న జడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి తదితరులు

పూతలపట్టు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మురళీమోహన్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో గురువారం నియోజకవర్గస్థాయి ఉపాధి హామీ పథకం విత్‌హెల్డ్ అమౌంట్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషితో పెండింగ్ బిల్లులు మంజూరయ్యాయని చెప్పారు. వైసీపీ నాయకులు చేసిన విమర్శలు, ఎగతాళి వ్యాఖ్యలను ఇప్పుడు ప్రజలే తిప్పికొడుతున్నారని విమర్శించారు. టీడీపీ మండల అధ్యక్షుడు దొరబాబు చౌదరి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి యువరాజు నాయుడు, పార్లమెంటు అధికార ప్రతినిధి గంగారపు గోపి, ఐరాల, యాదమరి, బంగారుపాళ్యం మండలాల టీడీపీ అధ్యక్షులు గంగారపు హరి, మురార్జీ యాదవ్, ఎన్‌పీ ధరణీ నాయుడు, బంగారుపాళ్యం ఏఎంసీ చైర్మన్ భాస్కర్ నాయుడు, జడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి, పూతలపట్టు, ఈసీపల్లె సింగిల్ విండోల చైర్మన్లు జగన్నాథం, ఇంద్రసేన నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం



ఐరాల(కాణిపాకం), ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కాణిపాకం జడ్పీ హైస్కూల్‌లో ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు కాణిపాకపట్నంలోని కెనరా బ్యాంకు బ్రాంచి వారు గురువారం ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ ప్రత్యూష, హెచ్‌ఎంలు గోపినాథరెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ



నగరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీని గురువారం ప్రిన్సిపాల్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు భాస్కర్‌రాజు, గోపి, రామాంజులు, హరి, కిరణకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'టీడీపీకి పట్టం కట్టిన ఓటర్లు'



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ఓటర్లు తమకు పట్టం కట్టారని టీడీపీ నాయకులు తెలిపారు. గురువారం పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు మీడియాతో మాట్లాడారు. తొలిసారి ఓటర్లు నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటు వేశారన్నారు. చుడా చైర్‌పర్సన్ హేమలత, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ సీఎంటీ త్యాగరాజన్, రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్, కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు. ఈ అంశంపై ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మీడియాతో మాట్లాడుతూ.. తమ అభ్యర్థుల విజయాన్ని ప్రజల గెలుపుగా అభివర్ణించారు.

పచ్చికాపల్లంలో సంబరాలు

వెదురుకుప్పం: టీడీపీ అభ్యర్థుల విజయం సాధించడంపై గురువారం పచ్చికాపల్లంలో కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టీడీపీ నాయకులు రాజశేఖర్‌వర్మ, వెంకటరమణారెడ్డి, జయరామిరెడ్డి, జనసేన నాయకుడు శేఖర్, బీజేపీ నాయకుడు విజయభాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం



గంగాధరనెల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): మండల సింగిల్‌విండో సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్మన్ ముప్పిరి మోహన్‌నాయుడు, మెంబర్లు బుర్రా జ్యోతియాదవ్, ఇమ్మానువేల్‌లకు గురువారం సన్మానించారు. జిల్లా తెలుగునాడు సింగిల్‌విండో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు విజయకుమార్‌రెడ్డి, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ గోమతి, క్యాషియర్ మాబూని, సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు పరిశ్రమలో పరిశీలన



కుట్టుపరిశ్రమలో ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నగరిలో తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి మీరా నిర్వహించే రెడీమేడ్ కుట్టు పరిశ్రమను చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే భానుప్రకాష్ గురువారం సందర్శించారు.అక్కడున్న టైలర్లతో ముచ్చటించారు. ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న యాజమాన్యాన్ని అభినందించారు.

రెవెన్యూ సమస్యలపై కలెక్టర్‌తో చర్చ: రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో కార్యాలయంలో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో ఎంపీ, ఎమ్మెల్యే చర్చించారు. తెరణిలో ఇంటిస్థలాలు ఇప్పించాలని దళితులు నాయకులను కోరగా.. కలెక్టర్‌తో చెప్పి వెంటనే పరిష్కరించారు.

'యూరియా కొరత లేదు'

యాదమరి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యూరియాకు కొరత లేదని వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ తెలిపారు. పెరియంబాడి గ్రామ పంచాయతీ పరిధిలో వరి పంటలో వచ్చిన తెగుళ్లను గురువారం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం 3,200 టన్నుల యూరియా స్టాక్ అందుబాటులో ఉందన్నారు. యూరియా అధిక మోతాదులో వాడితే పశువులకు, మనుషులకు ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

తేలికపాటి జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులు దూరం

విజయపురం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తేలికపాటి జాగ్రత్తలతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉండవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి విష్ణుప్రియ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జమున అధ్యక్షతన విజయపురం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రావెల్‌ను ఇష్టానుసారం తరలిస్తున్నారని వైస్ ఎంపీపీ మంజు బాలాజి తెలిపారు. వేర్వేరు బిల్లులతో గ్రావెల్ తరలిస్తుండగా ఆరు టిప్పర్లు సీజ్ చేశామని తహసీల్దార్ కిరణ్ తెలిపారు. శ్రీహరిపురం పాఠశాలవిద్యార్థులకు బస్సు పాసులు ఇవ్వలేదని బూచివానత్తం ఎంపీటీసీ రాజగోపాల్ చెప్పారు.ఎంపీడీవోరాజేంద్ర, ఏవో రజినీ కుమారి, ఎంఈవో హరిప్రసాద్‌వర్మ, సీడీపీవో ఇందిర ప్రియదర్శిని, సింగిల్‌విండో అధ్యక్షులు బాబుయాదవ్, బాబునాయుడు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

'నగర అభివృద్ధికి సహకరిస్తాం'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగర అభివృద్ధికి తమ సహకారం ఎప్పుడూ ఉంటుందని ప్రకాశం హైరోడ్డు యజమానులు అంగీకారం తెలిపారు. ప్రకాశం హైరోడ్డులోని భవన యజమానులు దామోదర్‌నాయుడు, జ్ఞాన ప్రకాష్‌లు గురువారం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్రకు అంగీకార పత్రాలు అందజేశారు.

ఆ ఇద్దరికీ అంత్యక్రియలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణికి వెళుతుండగా మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైసీపీ నేత సురేంద్రరెడ్డి తమ్ముడు చిన్నబ్బరెడ్డి (విశ్వనాథరెడ్డి), మనవడు శాన్విక్‌రెడ్డి మృతదేహాలకు గురువారం అంత్యక్రియలు పూర్తిచేశారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డిపల్లెలో చిన్నబ్బరెడ్డి మృతదేహానికి వైసీపీ, టీడీపీ నేతలు నివాళి అర్పించారు. కాగా, వేపంజేరి సర్పంచ్ వాసుదేవరెడ్డి తన కుమారుడు చిన్నబ్బరెడ్డి, మునిమనవడు శాన్విక్‌రెడ్డి మృతదేహాలను చూసి బోరున విలపించారు.



చిన్నబ్బరెడ్డి మృతదేహం వద్ద విలపిస్తున్న కుమార్తె యశ్విత, కుమారుడు యశ్వంత్‌రెడ్డి - శాన్విక్‌రెడ్డి మృతదేహం

ఆడికృత్తిక ఉత్సవాలకు ధ్వజారోహణం

వెదురుకుప్పం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం కుమారగిరి కొండపై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆడికృత్తిక ఉత్సవాలకు ధ్వజారోహణ కార్యక్రమాన్ని గురువారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్వేటినగరం ఎంపీపీ లత కుటుంబీకులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఏర్పాట్లను ఆలయ ఈవో కృష్ణనాయక్ పర్యవేక్షించారు. ఆలయ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత మేశం రవియాదవ్, నేతలు రాజశేఖర్, హేమంత్‌రెడ్డి, సాయికుమార్, ధనశేఖర్‌మొదలియార్‌పాల్గొన్నారు.